సాక్షి పెద్దపల్లి

బుధవారం । 15 । నవంబర్ । 2023



ఎక్లాస్‌పూర్ చెక్‌పోస్టు తనిఖీ

మంథని: ఎక్లాస్‌పూర్ చెక్‌పోస్టును జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి తనిఖీ చేశారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న దేవేందర్‌పై కేసు నమోదు చేశారు.



ఆకాశదీపం పూజలు

వేములవాడ: రాజన్న సన్నిధిలో మంగళవారం కార్తీకమాసం వేడుకలు ప్రారంభమయ్యాయి. జేగంట వద్ద స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ పూజలు చేశారు.

గరిష్టం/కనిష్టం
33.0 /26.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు తేలనున్న అభ్యర్థుల లెక్క

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: నామినేషన్ల పరిశీలన అనంతరం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 261 మంది అభ్యర్థులు ఆమోదం పొందగా, మంగళవారం ఏడుగురు తమ నామినేషన్లు విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో ప్రస్తుతం 254మంది పోటీదారులుగా ఉన్నారు. వీరిలో ఎవరెవరు పోటీనుంచి తప్పుకుంటారో బుధవారం సాయంత్రానికి తేలిపోనున్నది. మంగళవారం మానకొండూర్ అసెంబ్లీలో ఒకరు, చొప్పదండిలో 2, మంథనిలో 2, కోరుట్లలో 1, వేములవాడలో 1 చొప్పున మొత్తం ఏడుగురు తమ నామినేషన్లు ఉపసహరించుకున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల బరిలో 15మంది కన్నా మించితే రెండు ఈవీఎంలు ఉపయోగించాల్సి వస్తుందని, పోటీలో నిలిచిన ఇండిపెండెంట్ అభ్యర్థులతో మంతనాలు కొనసాగిస్తున్నారు. వారిని పోటీ నుంచి తప్పుకునేందుకు తమ వంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. దీంతో నేడు ఉపసంహరణ గడువు ముగిసే లోపు మరికొంతమంది తమ నామినేషన్లు ఉపసంహరించుకునే అవకాశం ఉంది.

ఇప్పటివరకు బరిలో ఉన్నవారు..

కరీంనగర్ నియోజకవర్గం పరిధిలో 31 మంది, చొప్పదండిలో 15, మానకొండూర్‌లో 12, పెద్దపల్లి 25, మంథని 22, రామగుండం 26, జగిత్యాల 19, కోరుట్లలో 19, ధర్మపురి నుంచి 18, హుజూరాబాద్ 25, సిరిసిల్లలో 23, వేములవాడ నుంచి 19 మంది మొత్తంగా ఇంకా 254 మంది బరిలో ఉన్నారు.

ఆర్వో ఆఫీస్ తనిఖీ



రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో శ్రీధర

మంథని: మంథని అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఎన్నికల సాధారణ పరిశీలకుడు సీఎన్ శ్రీధర, కేంద్ర వ్యయ పరిశీలకుడు సునీల్ శ్రీవాత్సవ మంగళవారం పరిశీలించారు. ఎన్నికల నిర్వాహణ ఏర్పాట్లు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ఓటర్ జాబితా, స్లిప్పుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహణతోపాటు ఇతర ఏర్పాట్లపై సమీక్షించారు. రిటర్నింగ్ అధికారి హనుమా నాయక్, తహసీల్దార్ రాజయ్య, మీడియా నోడల్ అధికారి తూము రవీందర్, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ సంతోష్‌సింగ్ తదితరులు ఉన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు ఉంటే 81256 84450 నంబరుకు ఫోన్, మెస్సేజ్ ద్వారా ఎన్నికల జనరల్ పరిశీలకులు, సీఎన్ శ్రీధరకు చేయాలని రిటర్నింగ్ అధికారి హనుమా నాయక్ తెలిపారు.

నాణ్యమైన ధాన్యం తేవాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్/పాలకుర్తి(రామగుండం): రైతులు నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యం తీసుకొస్తే ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. పెద్దపల్లి మండలం కురుమపల్లి, పాలకుర్తి మండలం బసంత్‌నగర్, రామారావుపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన మంగళవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలు, రైసు మిల్లుల్లో హమాలీల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిమితికి లోబడి లారీల్లో ధాన్యం తరలించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్రక్‌షీట్‌లో వివరాలు నమోదు చేసి, రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వందశాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా పనిచేయండి



మానేరును పరిశీలిస్తున్న అధికారులు

ముత్తారం: అసెంబ్లీ ఎన్నికల్లో వందశాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా పనిచేయాలని కేంద్ర ఎన్నికల పరిశీలకుడు శ్రీధర్‌గౌడ్ సూచించారు. పారుపల్లి సమీప మానేరు అవలి శాత్రజ్‌పల్లి గిరిజన గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ట్రాక్టర్‌పై మానేరులో ప్రయాణం చేసి శాత్రజ్‌పల్లి చేరుకున్నారు. గిరిజనులు వందశాతం ఓటుహక్కు వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనులు మానేరుదాటి పారుపల్లిరావడానికి ట్రాక్టర్ సౌకర్యం కల్పించాలని చెప్పారు. ఈసందర్భంగా మానేరు పరిసరాలు పరిశీలించారు. అనంతరం పారుపల్లి, ముత్తారం, కేశనపల్లి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తహసీల్దార్ రాజేశ్వరి, సీఐ సతీశ్, ఎస్సై మధుసూదన్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

యువతే నిర్ణేత

ఉమ్మడి జిల్లాలో 93,849 మందికి తొలిసారి ఓటుహక్కు

జంగ్ తెలంగాణ

- మొత్తం ఓట్లలో 30–39 ఏళ్లలోపు వారివే అధికం
- ప్రధాన పార్టీల చూపు వారివైపే..

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాల్లో యువ ఓటర్లే కీలకం కానున్నారు. కొత్తగా ఓటు నమోదుకు ఎన్నికల సంఘం పలుమార్లు గడువు ఇవ్వడంతో 18 ఏళ్లు నిండినవారు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో యువ ఓటర్లు నమోదయ్యారు. దీంతో ప్రధాన పార్టీలన్నీ వారిని ప్రసన్నం చేసుకోవడానికి కార్యచరణను రూపొందించుకుంటున్నాయి. ఇందుకోసం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలలో ప్రత్యేక విభాగాలు పని చేస్తున్నాయి. ఎన్నికలకు ఇంకా 15 రోజుల సమయమే ఉండటంతో ఆయా పార్టీల నాయకులు క్షేత్రస్థాయిలో యువ ఓటర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎలాగైనా వారిని తమవైపు తిప్పుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

ముంచుతారో.. తేల్చుతారోనని భయం

2018 ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థికి, ఓడిన అభ్యర్థికి మధ్య చాలా నియోజకవర్గాల్లో స్వల్ప తేడా మాత్రమే ఉంది. ప్రస్తుతం పెరిగిన యువ ఓటర్ల సంఖ్య దాదాపుగా దీనికి సమానంగా ఉండటంతో ఫలితాలపై వీరి ప్రభావం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అలాగే, మొత్తం ఓటర్లలో 30 నుంచి 39 ఏళ్ల మధ్య వయసున్నవారే అధికంగా ఉన్నారు. వారు తమను ముంచుతారో.. తేల్చుతారోనని అని పార్టీలూ భయపడుతున్నాయి. బయటకు మాత్రం పెరిగిన ఓట్లు తమకే లాభం చేకూరుస్తాయని చెప్పుకుంటున్నప్పటికీ లోపల ఆందోళన చెందుతున్నట్లు సమాచారం.

మంథనిలో ఎక్కువ మంది..

ఓటరు జాబితా ప్రకారం తొలిసారిగా ఓటుహక్కు నమోదు చేసుకున్నవారు మంథనిలో(8,716), 80 ఏళ్ల పైబడినవారు కరీంనగర్‌లో (5,316) ఎక్కువ మంది ఉన్నారు. మొత్తంగా చూసినట్లయితే ఉమ్మడి జిల్లాలో 18 నుంచి 39 ఏళ్లలోపు వారి ఓట్లే అధికం. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో వీరి ఓట్లు 50 శాతానికి పైనే ఉన్నాయి. వారిని మచ్చిక చేసుకుంటే గెలుపు నల్లేరుపై నడకేనని భావిస్తున్న పార్టీలు తమ వైపు తిప్పుకోవాలని చూస్తున్నాయి.



నియోజకవర్గాల వారీగా పెరిగిన ఓటర్లు..

18–19 ఏళ్లవారు: కోరుట్లలో 8,178, జగిత్యాలలో 7,744, ధర్మపురిలో 7,483, రామగుండంలో 5,990, మంథనిలో 8,716, పెద్దపల్లిలో 8,530, కరీంనగర్‌లో 8,598, చొప్పదండిలో 6,165, వేములవాడలో 6,246, సిరిసిల్లలో 6,735, మానకొండూర్‌లో 5,863, హుజూరాబాద్‌లో 9,008, హుస్నాబాద్‌లో 7,293 మంది ఉన్నారు.

20–29 ఏళ్లవారు : కోరుట్లలో 50,192, జగిత్యాలలో 48,116, ధర్మపురిలో 47,928, రామగుండంలో 44,226, మంథనిలో 51,575, పెద్దపల్లిలో 51,851, కరీంనగర్‌లో 69,457, చొప్పదండిలో 46,862, వేములవాడలో 47,132, సిరిసిల్లలో 48,857, మానకొండూర్‌లో 42,820, హుజూరాబాద్‌లో 52,478, హుస్నాబాద్‌లో 48,332 మంది ఉన్నారు.

30–39 ఏళ్లవారు : కోరుట్లలో 57,837, జగిత్యాలలో 50,807, ధర్మపురిలో 53,451, రామగుండంలో 64,456, మంథనిలో 63,667, పెద్దపల్లిలో 66,875, కరీంనగర్‌లో 90,160, చొప్పదండిలో 54,030, వేములవాడలో 55,914, సిరిసిల్లలో 62,727, మానకొండూర్‌లో 57,107, హుజూరాబాద్‌లో 64,862, హుస్నాబాద్‌లో 66,026 మంది ఉన్నారు.

40–49 ఏళ్లవారు : కోరుట్లలో 50,166, జగిత్యాలలో 45,345, ధర్మపురిలో 43,805, రామగుండంలో 44,859, మంథనిలో 44,406, పెద్దపల్లిలో 49,862, కరీంనగర్‌లో 76,432, చొప్పదండిలో 44,057, వేములవాడలో 42,463, సిరిసిల్లలో 48,046, మానకొండూర్‌లో 42,206, హుజూరాబాద్‌లో 48,866, హుస్నాబాద్‌లో 46,238 మంది ఉన్నారు.

50–59 ఏళ్లవారు : కోరుట్లలో 37,945, జగిత్యాలలో 38,322, ధర్మపురిలో 34,766, రామగుండంలో 33,977, మంథనిలో 33,608, పెద్దపల్లిలో 34,998, కరీంనగర్‌లో 54,631, చొప్పదండిలో 36,660, వేములవాడలో 33,003, సిరిసిల్లలో 36,249, మానకొండూర్‌లో 32,519, హుజూరాబాద్‌లో 34,136, హుస్నాబాద్‌లో 34,294 మంది ఉన్నారు.

60–69 ఏళ్లవారు : కోరుట్లలో 22,606, జగిత్యాలలో 23,644, ధర్మపురిలో 22,576, రామగుండంలో 19,230, మంథనిలో 20,760, పెద్దపల్లిలో 24,414, కరీంనగర్‌లో 33,230, చొప్పదండిలో 25,432, వేములవాడలో 21,982, సిరిసిల్లలో 24,130, మానకొండూర్‌లో 23,475, హుజూరాబాద్‌లో 23,359, హుస్నాబాద్‌లో 23,981 మంది ఉన్నారు.

70–79 ఏళ్లవారు : కోరుట్లలో 10,928, జగిత్యాలలో 12,672, ధర్మపురిలో 12,580, రామగుండంలో 6,901, మంథనిలో 10,691, పెద్దపల్లిలో 13,592, కరీంనగర్‌లో 17,230, చొప్పదండిలో 14,473, వేములవాడ లో 11,752, సిరిసిల్లలో 13,145, మానకొండూర్‌లో 13,148, హుజూరాబాద్‌లో 12,357, హుస్నాబాద్‌లో 14,017 మంది ఉన్నారు.

80+ ఏళ్లవారు : కోరుట్లలో 3,003, జగిత్యాలలో 4,818, ధర్మపురిలో 4,291, రామగుండంలో 1,380, మంథనిలో 3,019, పెద్దపల్లిలో 4,144, కరీంనగర్‌లో 5,316, చొప్పదండిలో 5,311, వేములవాడలో 3,759, సిరిసిల్లలో 4,537, మానకొండూర్‌లో 4,475, హుజూరాబాద్‌లో 4,492, హుస్నాబాద్‌లో 2,001 మంది ఉన్నారు.



ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలి

- నేటితో ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు
- ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్ రాణా

జ్యోతినగర్(రామగుండం): అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పక పాటించాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్‌రాణా సూచించారు. ఎన్టీపీసీ మిలీనియంహాల్‌లో అభ్యర్థులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో రిటర్నింగ్ అధికారి అరుణశ్రీతో కలిసి మాట్లాడారు. ప్రచార అనుమతి కోసం 48 గంటల ముందు సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన దరఖాస్తులల కోసం రామగుండం రిటర్నింగ్ కార్యాలయంలో ప్రత్యేక విభాగం, ఆపరేటర్లను ఏర్పాటు చేశామన్నారు. పోస్టర్లు, వీడియోలు, ఆడియో పాటల కోసం ఎంసీఎంసీ(మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ) ద్వారా అనుమతి పొందాలన్నారు. అభ్యర్థులు సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలన్నారు. తమపై క్రిమినల్ కేసులు ఉంటే ఎలక్ట్రానిక్ మీడియా, న్యూస్ పేపర్లలో ఈనెల 16 నుంచి 27వ తేదీ మధ్య మూడుసార్లు యాడ్ ఇవ్వాలనే నిబంధన ఉందన్నారు. ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందన్నారు. ఫిర్యాదుల కోసం రోజూ సాయంత్రం ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్ జ్యోతిభవన్ అతిథి గృహంలో సంప్రదించాలని సూచించారు. ఇందుకోసం మొబైల్ నంబరు : 83338 94668, ల్యాండ్‌లైన్ నంబరు 08728–293166ను అందుబాటులోకి తెచ్చామని వివరించారు. సహాయ వ్యయ పరిశీలకుడు అశోక్ కుమార్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్, ఏఆర్వోలు కుమారస్వామి, రామ్మోహన్‌రావు, జ్యోతి, మీడియా, కమ్యూనికేషన్ ప్లాన్ నోడల్ అధికారి రజని ఉన్నారు.

65 వేలు వస్తే గెలిచినట్లే..

- అంచనాల్లో మునిగితేలుతున్న అభ్యర్థులు
- గతంలో పోలింగ్ శాతం తక్కువే
- ఈసారి ఓటుబ్యాంకుపై ప్రత్యేక దృష్టి



గోదావరిఖని: అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపోటములపై అభ్యర్థులు ఇప్పుడే అంచనాలు వేసుకుంటున్నారు. మిగతా నియోజకవర్గాలకు భిన్నంగా రామగుండంలో పోలింగ్‌శాతం విభిన్నంగా ఉంటోంది. ఈసారి నియోజకవర్గంలో 2,14,974 మంది ఓటర్లు ఉన్నారు. అయితే, ఇందులో 60శాతంకన్నా ఎక్కువగా ఓట్లు పోలైయ్యే అవకాశం ఉండదని అభిప్రాయపడుతున్నారు. ఈలెక్కన సుమారు 1.20లక్షలపైగా ఓట్లు పోలయ్యే అవకాశాలుంటాయని భావిస్తున్నారు. నియోజకవర్గంలో రామగుండం, పాలకుర్తి, అంతర్గాం మండలాలు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా రామగుండం మండలంలో ఓటర్లు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ ఉద్యోగుల ఓట్లు ఈ మండలంలోనే ఎక్కువగా ఉన్నాయి. మాంచస్టర్ ఆఫ్ ఇండియాగా పేరున్న ఈప్రాంతంలో అత్యధికమంది సమీప ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పరుచుకుని రామగుండంలో ఉద్యోగాలు చేస్తున్నారు. అంతేకాకుండా సంస్థలో ప్రతినెలాఖరున కార్మికుల ఉద్యోగవిరమణ చేయడం, వారు ఇక్కడి క్వార్టర్ ఖాళీ చేసి వెళ్లిపోవడం సర్వసాధారణం. ఇక్కడ నమోదైన ఓట్లు అలాగే ఉండటం, రిటైర్ అయి వెళ్లిపోయిన ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోకపోవడంతో ఈప్రాంతంలో పోలింగ్ శాతం తక్కువగా నమోదవుతోందని అధికారులు భావిస్తున్నారు.

నియోజకవర్గం ఆవిర్భావం నుంచి..

- రామగుండం నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఓటింగ్ సరళి పరిశీలిస్తే.. 2009లో 51శాతం, 2014లో 61,87శాతం, 2018లో అత్యధికంగా 71.94శాతం పోలింగ్ నమోదైంది.
- గతంతో పోల్చితే ఈసారి పోలింగ్ శాతం సరాసరి 60శాతం నుంచి 65శాతం నమోదవుతుందని అధికారులు భావిస్తున్నారు.
- మరోవైపు.. రామగుండం అసెంబ్లీ నియోజకవర్గంలో ఈసారి 26మంది పోటీలో ఉండే అవకాశం ఉంది.

- ఇందులో ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఇండిపెండెంట్ అభ్యర్థుల మధ్యనే పోటీ ఉంటుందని ప్రచారం జరుగుతోంది.
- అయితే, ఓట్లు చీల్చితే 50వేలకుపైగా లేదా 65వేలకు లోపు ఓట్లు సాధిస్తే విజయం కైవసం చేసుకుంటామనే అంచనాల్లో అభ్యర్థులు తలమునకలైయ్యారు.
- దీనికోసం కచ్చితంగా ప్లాన్ చేసుకుంటూ మెజార్టీపై దృష్టి పెట్టారు.
- అయితే మెడికల్ ఇన్వాలిడేషన్ ద్వారా రిటైర్డ్ కార్మికుల స్థానంలో యువకార్మికులు ఉద్యోగాల్లో చేరడంతో కొంతమేర ఓటింగ్ శాతం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

సంవత్సరం	పోలైన ఓట్లు	శాతం
2018	1,36,140	71
కోరుకంటి చందర్(ఏఐఎఫ్‌బీ)	61,400	
ఎస్.సత్యనారాయణ(టీఆర్ఎస్)	34,941	
మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్	27,181	

సంవత్సరం	పోలైన ఓట్లు	శాతం
2014	1,37,638	61.87
ఎస్.సత్యనారాయణ(టీఆర్ఎస్)	35,789	
కోరుకంటి చందర్(ఏఐఎఫ్‌బీ)	33,494	
బాబర్‌సలీంపాషా(కాంగ్రెస్)	16,900	

సంవత్సరం	పోలైన ఓట్లు	శాతం
2009	1,19,051	58.10
ఎస్.సత్యనారాయణ(స్వతంత్ర)	32,479	
కౌశిక్ హరినాథ్(ప్రజారాజ్యం)	30,259	
బాబర్ సలీంపాషా(కాంగ్రెస్)	23,283	
కోరుకంటి చందర్(టీఆర్ఎస్)	15,984	

పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్

- రాష్ట్ర జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్



వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్‌కాస్టింగ్ నిర్వహణ పకడ్బందీగా ఉండాలని రాష్ట్ర జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ ఆదేశించారు. మంగళవారం జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వెబ్‌కాస్టింగ్‌కు అవసరమైన అధికారులు, సిబ్బందిని సిద్ధం చేసుకోవాలన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న యువత సేవలను వినియోగించాలని సూచించారు. ఓటరు స్లిప్పుల పంపిణీ షెడ్యూల్ సమాచారాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముందుగా చేరవేయాలని చెప్పారు. వారికి సీ విజిల్‌యాప్‌పై అవగాహన కల్పించాలని అన్నారు.

మంథని సెగ్మెంట్‌లో..

మంథని సెగ్మెంట్‌లో కొన్నిపొరపాట్లు దొర్లాయని, వాటిని సవరించాలని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. నియోజకవర్గంలోని భూపాలపల్లి జిల్లాలో గల మండలాలకు ములుగు జిల్లా అని ముద్రించారని పేర్కొన్నారు. అలాగే పోలింగ్ సమయం ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు అని ముద్రించారని, దీనిని 4గంటల వరకే అని సవరించాల్సి ఉందన్నారు. ఈడీఎం కవిత, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ పాల్గొన్నారు.

బాలసదనం ప్రారంభం

జిల్లా కేంద్రంలో బాలసదనం భవనాన్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రారంభించారు. ఇందులో 6–18 ఏళ్లలోపు అనాథ, రక్షణ, సంరక్షణ అవసరమైన ఆడపిల్లలకు వసతీసౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి రవుఫ్‌ఖాన్, బాలరక్షభవన్ కో ఆర్డినేటర్ సుగుణ, సీడీపీవో కవిత, పద్మ, డీసీపీవో కమలాకర్ ఉన్నారు.

సహకార పోస్టర్ ఆవిష్కరణ

సహకార వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆవిష్కరించారు. జిల్లా సహకార అధికారి శ్రీమాల, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

బూడిదబతుకులు

- ప్రభావిత గ్రామాల అభివృద్ధిపై ఎన్టీపీసీ నిర్లక్ష్యం
- కుందనపల్లి, అక్బర్‌నగర్ వాసులకు తప్పని తిప్పలు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

రామగుండం: కనుచూపు మేర పచ్చని పొలాలు.. చేలు.. సమృద్ధిగా పాడి పశువులు.. పక్షుల కిలకిలరావాలు.. ప్రశాంత వాతావరణం.. సంపూర్ణ ఆరోగ్యవంతులైన గ్రామస్తులు.. అంతోఇంతో ఆర్థికంగా నిలదొక్కుకున్న పల్లెవాసులు.. ఇది ఎన్టీపీసీ స్థాపనకు ముందు కుందనపల్లి గ్రామస్తుల జీవన విధానం. దేశంతోపాటు తమ ఊరుకూ వెలుగులు పంచుతుందనే ఆశతో పొలాలు, ఇళ్లు, పిల్లల భవిష్యత్ అప్పగిస్తే.. యువతను వేధిస్తున్న నిరుద్యోగం.. గడ్డికూడా మొలవని వ్యవసాయ క్షేత్రాలు.. బూడిత తప్ప మచ్చుకైనా కనిపించని స్వచ్ఛమైన గాలి.. ఏడాది పొడవునా ఏదోఒకవ్యాధితో బాధపడే పల్లెజనం.. ప్రస్తుతం ఎన్టీపీసీ ప్రభావిత కుందనపల్లి పల్లెజీవనం ఇది.. సుమారు నాలుగున్నర దశాబ్దాల క్రితం 200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రారంభమైన ఎన్టీపీసీ ప్రస్థానం.. ప్రస్తుతం 3,400 మెగావాట్లకు చేరింది. దేశానికి మిరమిట్లు గొలిపే విద్యుత్ వెలుగులు అందిస్తోంది. కానీ, కుందనపల్లి, అక్బర్‌నగర్‌లోని సుమారు 800 కుటుంబాలను అంధకారంలోకి నెట్టింది. కుందనపల్లి సమీపంలోనే నిర్మించిన బూడిదచెరువు ఆ కుటుంబాల బతుకులను ఆగం చేస్తోంది. అంతేకాదు.. కుందనపల్లి, అక్బర్‌నగర్‌తోపాటు రాజాపూర్(మొగల్‌పహాడ్) గ్రామస్తులకు దశలవారీగా సామాజిక బాధ్యత పథకం ద్వారా విడుదల చేసే నిధులతో (సీఎస్ఆర్) కనీస సదుపాయాలు కల్పించాల్సిన ఎన్టీపీసీ ఆ విషయమే మర్చిపోనట్లు వ్యవహరిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. ఫలితంగా పల్లెవాసులకు కష్టాలు తప్పడంలేదు.



చెరువు కట్ట పక్కన బూడిద నిల్వలు



మంచానికే పరిమితమైన చొప్పరి మల్లేశం

వెంటాడుతున్న వ్యాధులు..

- కుందనపల్లి గ్రామస్తులను చర్మసంబంధిత, ఊపిరితిత్తులు, కిడ్నీ తదితర వ్యాధులు వెంటాడుతున్నాయి.
- నాలుగేళ్ల క్రితం తన భర్త నల్ల రాములు ఊపిరితిత్తుల వ్యాధితో మృతి చెందినట్లు భార్య లక్ష్మి తెలిపింది. ఆమె కుమారుడు మధుకర్ బూడిద చెరువులో కూలీ పనిచేస్తున్నాడు. లక్ష్మి కూలీ పనులకు వెళ్తోంది.
- సిద్ధ రామస్వామి రెండేళ్ల క్రితం కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతిచెందాడు.
- అతడి భార్య లక్ష్మి ఉండగా, కుమారుడు గణేశ్ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కూతురుకు వివాహం చేయాల్సి ఉంది.
- పోతరవేణి శేఖర్ మూడేళ్ల క్రితం ఊపిరితిత్తుల వ్యాధితో చనిపోయాడు. అతడికి భార్య మమత ఉండగా ఇద్దరు పిల్లలు చిన్నారులు. మమత కూలీ పనులు చేస్తూ అష్టకష్టాలు పడుతోంది.
- పోతరవేణి రజిత రెండేళ్ల క్రితం కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతిచెందింది. ఇద్దరు కూతుళ్లు చిన్నపిల్లలు. భర్త కుమార్ ప్రైవేట్ వర్కర్. పిల్లలను పోషించడం కష్టంగా మారింది.
- సిద్ధ శ్యామల రెండేళ్ల క్రితం వివిధ అనారోగ్య సమస్యలతో మృతిచెందింది. భర్త భూమయ్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడున్నాడు. కూలీ పనులతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు.
- సుంకరి మాధవి నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. భర్త రాజయ్య, వీరికి ఇద్దరు కుమారులున్నారు. కూలీపని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.
- సిద్ధ శంకర్ మూడేళ్ల క్రితం మృతిచెందాడు. మృతుడికి భార్య దేవమ్మ, ఇద్దరు కుమారులు ఉండగా కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని సాకుతోంది.
- చొప్పరి మల్లేశం తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. అచేతనావస్థలో మంచానికే పరిమితమయ్యాడు.
- ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్టీపీసీ ప్రభావిత గ్రామాల ప్రజల అవస్థలు అన్నీఇన్నీ కావు.

నిర్వాసితుల డిమాండ్లు ఇవీ..

- ప్రభావిత గ్రామాల్లో అంతర్గత డ్రైనేజీ, రోడ్లు నిర్మించాలి
- అన్నివాడల్లో నీటిశుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- ఎండాకాలంలో యాష్‌పాండ్ నుంచి బూడిద లేవకుండా చర్యలు తీసుకోవాలి
- ప్రతీ కుటుంబానికి కార్పొరేట్ ఆస్పత్రిలో ఉచితంగా వైద్యసేవలు అందించాలి
- నిర్వాసితులకు ఉచితంగా కార్పొరేట్ విద్య అందించాలి
- ఇందుకోసం ఎన్టీపీసీ ఆధ్వర్యంలో కేజీ టూ పీజీ విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలి
- పాత ఇళ్లు తొలగించి అదేప్రాంతంలో టౌన్‌షిప్ నిర్మించాలి
- బూడిద క్రయ, విక్రయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని కుందనపల్లి గ్రామ పంచాయతీకి బదలాయించాలి
- ఇంటింటికీ నిర్దేశిత యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలి
- వీధుల్లో ఎల్ఈడీ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి
- గ్రామ కూడళ్లను అభివృద్ధి చేయాలి.

నిత్యం నరకయాతనే



మా ఇంటికి ఇరవై అడుగుల దూరంలోనే బూడిద చెరువు ఉంది. ఏటా ఏప్రిల్, మే, జూన్‌లో ఈదురుగాలులకు బూడిద లేచి మా ఇంట్లోకే వస్తుంది. ఊపిరి తీకునే పరిస్థితి ఉండదు. మా చేను ఎన్టీపీసీ తీసుకున్నా నేటికీ పరిహారం ఇవ్వలేదు. దిక్కులేని పరిస్థితుల్లో కాలం వెళ్లదీస్తున్నాం. – సుంకరి లక్ష్మి, కుందనపల్లి

బంధువులకూ ఇబ్బంది



ఎండాకాలంలో మా ఇంటికి బంధువులు వస్తే చాలాఇబ్బంది అనిపిస్తుంది. పదినిమిషాలకు ఒకసారి ఊడ్చినా బూడిద వస్తూనే ఉంటుంది. ఇప్పటి ఖర్చులకు మాకు వచ్చే ఆదాయానికి మరోచోట బతకలేని పరిస్థితి ఉంది. దిక్కులేక కాలం వెళ్లదీసుడే కానీ వేరే మార్గం లేదు. – నూనె గౌరమ్మ, కుందనపల్లి

మా ఆయన కనుమరుగైండు



మా ఆయన సారయ్య ఊపిరితిత్తుల వ్యాధితో ఏడాదిన్నర క్రితం చనిపోయాడు. నాకు ఇద్దరు చిన్నపిల్లలున్నారు. కూలీ పనికి పోతేనే నోటికాడికి ముద్ద వస్తది. పిల్లల చదువులు, ఆస్పత్రి ఖర్చులతో చాలా బాధలు పడుతున్నం. మాలాంటి కుటుంబాలను ఎన్టీపీసీ ఆర్థికంగా ఆదుకోవాలి. – చొప్పరి స్వరూప, కుందనపల్లి

క్లుప్తంగా

సహకార సంఘాలు బలోపేతం కావాలి



జెండా ఆవిష్కరించిన రిజిస్ట్రార్ అశోక్‌కుమార్

సుల్తానాబాద్: సహకార సంఘాలు బలోపేతమైనప్పుడే రైతులకు సేవలందుతాయని సహకార సంఘాల జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం సుల్తానాబాద్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో సహకార వారోత్సవాల్లో భాగంగా జెండా ఆవిష్కరించి, మాట్లాడారు. సంఘాల బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని అనేక సొసైటీలకు సుల్తానాబాద్ సంఘం ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. వారం రోజులపాటు జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్యాంక్ సూపర్‌వైజర్ కె.సాగర్ రెడ్డి, సంఘం కార్యదర్శి బూరుగు సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ఏర్పాట్లను అబ్జర్వర్ శ్రీధరన్ పరిశీలించారు. మంగళవారం రిటర్నింగ్ అధికారి మధుమోహన్‌తో సమావేశమై, పలు అంశాలపై చర్చించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని ఈవీఎం స్ట్రాంగ్ రూంను తనిఖీ చేశారు. అలాగే, పెద్దపల్లి మండలంలోని సబ్బితం పోలింగ్‌స్టేషన్‌లో ఏర్పాట్లపై ఆరా తీశారు. ఆయన వెంట పోలీస్, ఎన్నికల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

రామగుండం: అంతర్గాం మండలం ముర్మూర్‌లోని మూడు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్‌రాణా మంగళవారం సందర్శించారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని 11, 12, 13 డు కేంద్రాల్లో ఓటర్లు, సిబ్బందికి వసతుల కల్పన తదితర అంశాలపై రెవెన్యూ అధికారులతో చర్చించారు. అంతర్గాం రెవెన్యూ పరిశీలకుడు రాజేందర్‌రెడ్డి, బూత్ లెవల్ ఆఫీసర్ పెండ్యాల విమల, హెచ్‌ఎం గండ్ర రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురిపై కేసు

పాలకుర్తి: ఓ వ్యక్తిపై దాడి చేసిన నలుగురితో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు బసంత్‌నగర్ ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బసంత్‌నగర్ శివారులోని వైన్స్ వద్ద సోమవారం రాత్రి జీడీనగర్‌కు చెందిన సంపంగి ప్రశాంత్, ముద్దంగుల నరేశ్, ఒల్లెపు ప్రభాకర్, బోదాసు సారయ్యలు పాత గొడవలు మనసులో పెట్టుకొని, పెద్దపల్లి మండలంలోని కురుమపల్లికి చెందిన బీటి శేఖర్‌పై దాడి చేశారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, ఈ ఘర్షణ సమయంలో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లిన కానిస్టేబుల్ సురేశ్‌తో సంపంగి రాజు దురుసుగా ప్రవర్తించి, ఆయన విధులకు ఆటంకం కలిగించాడు. ఈ మేరకు మొత్తం ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

లక్ష్యం.. వందశాతం పోలింగ్

- ఊరూరా కళాబృందాలతో అవగాహన
- ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీల ఏర్పాటు
- సమావేశాలు నిర్వహిస్తున్న అధికారులు
- జిల్లాలో మూడు అసెంబ్లీ సెగ్మెంట్లు



ఓటుహక్కు వినియోగంపై కళాజాత

పెద్దపల్లిరూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం. ప్రతీ ఓటరు ఓటుహక్కు వినియోగించు కోవాలంటూ జిల్లా అధికార యంత్రాంగం విస్తృతంగా ప్రచారం చేస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా ప్రచారం కల్పించడంతోపాటు కళాబృందాల ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలోని ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరును వివరించారు. బూత్ లెవల్ అధికారులు సహా మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి అధికారులు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.

2018లో రామగుండంలో 71.75 శాతం

పెద్దపల్లి జిల్లాలో ఈ నెల 30న పోలింగ్ జరగనుంది. గతంతో పోలిస్తే ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పెద్దపల్లి అసెంబ్లీ స్థానంలో 2014లో 76 శాతం పోలింగ్ నమోదవగా.. 2018లో 83.86 శాతానికి పెరిగింది. అలాగే మంథని సెగ్మెంట్‌లో 2014లో 81 శాతం, 2018లో 85.14 శాతం, రామగుండంలో 2014లో 62 శాతం, 2018లో 71.75 శాతం నమోదైంది. అయితే, ఈసారి ఎన్నికల్లో శతశాతం పోలింగ్ లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు.

ఈసారి అభ్యర్థి ఫొటో కూడా..

ఓటరు ఓటు వేసేందుకు వెళ్లగానే ఈవీఎం మెషిన్‌పై లైట్ వెలుగుతుంది. ఓటరు తాను ఎంచుకున్న గుర్తుపై నొక్కాలి. పక్కనే ఉన్న వీవీప్యాట్‌పై చూడాలి. అందులో తాను వేసిన గుర్తు కనిపిస్తుంది. తర్వాత బీప్‌మని శబ్దం వచ్చి, ఆ గుర్తు కనిపించదు. ఈసారి ఎన్నికల్లో గుర్తుతోపాటు అభ్యర్థి ఫొటో కూడా ఓటర్లకు కనిపించేలా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకున్నారు.

ప్రతీ ఎన్నికల్లో ఓటేస్తున్న



నేను ప్రతీ ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటేస్తున్న. సర్పంచ్, సొసైటీ ఎన్నికల్లోనూ పాల్గొంటా. ఈసారి కూడా ఓటు వేస్తా. ఓటుహక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత.
– భూతం పోచాలు, పెద్దపల్లి

తొలిసారి వేయబోతున్న



నేను తొలిసారి ఓటు వేయబోతున్న. ఎన్నికల అధికారులు ఓటుహక్కు ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు. ప్రచార వాహనాలను ఊరూరా తిప్పుతున్నారు.
– తోట శివ, సబ్బితం పెద్దపల్లిమండలం

ఓటెలా ఏసుడో చెప్పంద్రు



మెషిన్ మీద ఓటెలా ఏసుడో అధికారులు వివరంగా చెప్పిర్రు. ఓటేసినంక చప్పుడత్తదని అన్నరు. ఆలోపల మనం ఎవరికి ఓటేసినమో కూడా చూడచ్చని అర్థమైంది.
– కందునూరి సంజీవరావు, మారెడుగొండ

విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ మేడిపల్లి అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

న్యూపీకే రామయ్యకాలనిలోని సబ్‌స్టేషన్‌లో..
తేదీలు: ప్రతీ నెల 1 నుంచి 10వ తేదీ వరకు
సమయం: ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు

న్యూపీకే రామయ్యకాలనీలోని సబ్‌స్టేషన్‌లో..
తేదీలు: ప్రతీ నెల 11 నుండి 14వ తేదీ వరకు
సమయం: ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు

కృష్ణానగర్ శ్రీనివాస లాడ్జి వద్ద..
తేదీలు: ప్రతీ నెల 15, 17వ తేదీల్లో..
సమయం: ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు

అన్నపూర్ణకాలనీ భద్రయ్య హోటల్ ఎదురుగా
తేదీలు: ప్రతీ నెల 16, 26..
సమయం: ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు

మేడిపల్లి గ్రామం, న్యూపోరట్‌పల్లిలో..
తేదీలు: ప్రతీ నెల 18
సమయం: ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు

న్యూపీకే రామయ్యకాలనీ సబ్‌స్టేషన్‌లో..
తేదీలు: ప్రతీ నెల 18..
సమయం: ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు

న్యూపీకే రామయ్యకాలనీ ఆటోస్టాండ్ వద్ద..
తేదీలు: ప్రతీ నెల 19..
సమయం: ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు

న్యూపీకే రామయ్యకాలనీ సబ్‌స్టేషన్ వద్ద..
తేదీలు: ప్రతీ నెల 19..
సమయం: ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు

న్యూపీకే రామయ్యకాలనీ సబ్‌స్టేషన్‌లో..
తేదీలు: ప్రతీ నెల 20 నుంచి 30
సమయం: ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు

ఆటోనగర్‌లో..
తేదీలు: ప్రతీ నెల 22
సమయం: ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ బిల్లుల కేంద్రాలు అందుబాటులో ఉంటాయని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

మీకు తెలుసా?

అభ్యర్థుల ఖర్చు ఎంతంటే..

సాక్షి, పెద్దపల్లి: ఎన్నికల్లో ధన ప్రవాహం అరికట్టి, ప్రచార వ్యయం అభ్యర్థులు అందరికీ సమానంగా ఉండేలా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని 1951లో రూపొందించారు. ఏ అభ్యర్థి ఎంతఖర్చు చేయాలనేది నిర్దేశిస్తూ సెక్షన్ 19లో వివరించారు. ఎన్నికలు జరిగే సమయంలో ధరలకు అనుగుణంగా ఖర్చు వెల్లడిస్తారు. ఇందులో భాగంగా నామినేషన్ దాఖలు చేసిన రోజు నుంచి ఫలితం వెల్లడయ్యే వరకూ స్వయంగా లేదా, ఏజెంట్ ద్వారా ప్రచార ఖర్చును 30రోజుల్లో లెక్క చూపించాలి. పెరిగిన ధరలు, ఓటర్లు, ద్రవ్యోల్బణ సూచీ ఆధారంగా ఎన్నికల వ్యయ పరిమితి పెంచుతారు. దీంతో 2018 ఎన్నికల్లో అభ్యర్థి ఖర్చు రూ.28లక్షలు ఉండగా, 2023 ఎన్నికల్లో అది రూ.40లక్షలకు పెంచారు. లోక్‌సభ ఎన్నికలకు రూ.70లక్షల నుంచి రూ.77లక్షలకు పెంచారు. రాష్ట్రాలను బట్టి అభ్యర్థుల వ్యయ పరిమితి వేర్వేరుగా ఉంటుంది.

ఎన్టీపీసీ గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి నియామకం



బండారి కనకయ్య

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఉద్యోగ గుర్తింపు కార్మిక సంఘం (ఐఎన్టీయూసీ మజ్దూర్ యూనియన్) ప్రధాన కార్యదర్శిగా బండారి కనకయ్య నియమితులయ్యారు. ఇది వరకు పని చేసిన కొలిపాక మల్లయ్య తన బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దీంతో యూనియన్ సెక్రటరీ జనరల్ బాబర్ సలీం పాషా ఆయన స్థానంలో కనకయ్య పేరును మంగళవారం ప్రకటించారు. జాతీయస్థాయి నాయకుడిగా ఉన్న ఆయన మరోసారి స్థానిక గుర్తింపు సంఘంలో కీలక బాధ్యతలు చేపట్టారు. తనను ప్రధాన కార్యదర్శిగా నియమించిన సెక్రటరీ జనరల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వేధిస్తున్న భర్తపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన రవి తన భార్యను వేధిస్తుండడంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై గౌతంపవార్ కథనం ప్రకారం.. రజితకు 20 ఏళ్ల క్రితం రవితో వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొన్నిరోజులుగా రవి అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధిస్తున్నాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఖరీదైన వైద్యం చేయించుకోలేక నిరుపేద మృతి



లక్ష్మణ్ (ఫైల్)

చందుర్తి(వేములవాడ): ఖరీదైన వైద్యం చేయించుకోలేక ఓ నిరుపేద వ్యక్తి మృతిచెందిన ఘటన చందుర్తి మండలం కట్టలింగంపేటలో మంగళవారం విషాదం నింపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కట్టలింగంపేటకు చెందిన మల్లారపు లక్ష్మణ్(55) నెల రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. లక్ష్మణ్‌ను వైద్యులు పరీక్షించి రెండు కిడ్నీలు పాడయ్యాయని, డయాలసిస్ చేయించుకోవాలని సూచించారు. నాలుగైదుసార్లు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీలో డయాలసిస్ చేయించుకున్నాడు. కూలీ పని చేసుకుని జీవించే ఈ కుటుంబానికి రవాణా ఖర్చులే భారంగా మారాయి. మంగళవారం డయాలసిస్ చేయించుకునేందుకు కరీంనగర్ వెళ్లాడు. చికిత్స అందుతున్న క్రమంలోనే లక్ష్మణ్ మృతిచెందాడని గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య మల్లవ్వ, కూతురు మౌనిక, ఇద్దరు కుమారులు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

కరెంట్ షాక్‌తో గృహిణి..

సిరిసిల్లటౌన్: కరెంట్ షాక్‌తో ఓ గృహిణి మృతిచెందిన సంఘటన స్థానికంగా విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కు చెందిన ఉడుత లావణ్య(40) మంగళవారం ఉదయం బట్టలు ఉతికి ఇంటి ముందర వైరుపై ఆరవేస్తుండగా కరెంట్ వైర్లకు ఉన్న జీవైరు తగిలి షాక్‌తో మృతిచెందింది. మృతురాలి మేనమామ అన్నల్‌దాస్ నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

గేదె దాడిలో ఒకరు..

వీణవంక(హుజూరాబాద్): ఇప్పలపల్లికి చెందిన ముదిగంటి రాజిరెడ్డి(50) తన గేదె దాడిలో మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజిరెడ్డి మంగళవారం తన ఇంటి సమీపంలో గేదెకు వరి గడ్డి వేస్తున్నా డు. ఆ సమయంలో అది ఒక్కసారిగా కొమ్ములతో పొడవడంతో పక్కనున్న బండరాళ్లపై ఎగిరిపడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆసిఫ్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఓట్లు రాలేదా.. డిపాజిట్ గోవిందా

- ఎన్నికల్లో డిపాజిట్లు దక్కితేనే అభ్యర్థులకు గౌరవప్రదమైన ఓటమి
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 326 మంది నామినేషన్ దాఖలు



కథలాపూర్(వేములవాడ): ఎదుటి పార్టీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా రావు.. ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు తరుచూ అంటున్న మాటలివి. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం అభ్యర్థులకు తమ డిపాజిట్ డబ్బులు తిరిగి వస్తే అది గౌరవప్రదమైన ఓటమిగా భావిస్తారు. ఆ డబ్బులు తిరిగి రాకపోతే అభ్యర్థి చిత్తుగా ఓడిపోయినట్లే లెక్క.

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలంటే..

శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయాలంటే రూ.10 వేలు డిపాజిట్‌గా ఎన్నికల సంఘం అధికారులు నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు మాత్రం రూ.5 వేలు చెల్లిస్తే సరిపోతుంది. నామినేషన్ దాఖలు చేసే సమయంలో రిటర్నింగ్ అధికారి వద్ద ఈ డబ్బులను డిపాజిట్ చేస్తారు. సదరు అధికారి ఈ మొత్తాన్ని ఎస్టీవోలోని ప్రత్యేక ఖాతాలో జమ చేస్తారు. నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి అభ్యర్థుల వ్యక్తిగత వివరాల పరిశీలన, సర్టిఫికెట్లు, ఈవీఎంలపై గుర్తుల కేటాయింపు, సర్వీస్ ఓటర్లకు బ్యాలెట్ పేపర్లపై గుర్తులను ముద్రించడం వంటి ప్రతీ అంశంపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంటుంది. అభ్యర్థికి సంబంధించిన ప్రచార ఖర్చులు, ప్రతీ కదలికపై ఎన్నికల సంఘం నియమించిన ప్రత్యేక అధికారుల బృందాలు నిశిత పరిశీలన చేస్తారు. అభ్యర్థులు ఏదో నామమాత్రంగా పోటీ చేస్తే ఎన్నికల సంఘానికి అనవసర ఖర్చు పెరగడంతోపాటు అధికారుల విలువైన సమయం వృథా అవుతుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం పోటీచేసే అభ్యర్థుల నుంచి షరతులతో కూడిన తిరిగి చెల్లించే సెక్యూరిటీ డిపాజిట్లను స్వీకరిస్తోంది.

ఆరోవంతు ఓట్లు సాధిస్తేనే..

ఎన్నికల్లో నిలబడిన అభ్యర్థి నియోజకవర్గంలో మొత్తం పోలైన ఓట్లలో ఆరో వంతు ఓట్లను సాధించాల్సి ఉంటుంది. ఆరో వంతు ఓట్లు వచ్చిన అభ్యర్థికి ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం రిటర్నింగ్ అధికారి డిపాజిట్ తిరిగి చెల్లిస్తారు. లేకపోతే ఆ డబ్బులను ఎన్నికల సంఘం అధికారులు స్వాధీనం చేసుకుంటారు.

విత్ డ్రా, స్క్రూటినీలో తిరస్కరించినవారికి..

అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినప్పటికీ పలు కారణాలతో విత్ డ్రా చేసుకుంటే వారు చెల్లించిన డిపాజిట్ తిరిగి చెల్లిస్తారు. నామినేషన్ల పరిశీలనలో తిరస్కరణకు గురైన వారికి డిపాజిట్ డబ్బులు తిరిగి చెల్లిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఏదేమైనా ఎన్నికల్లో బరిలో నిలవడం ఒక ఎత్తయితే.. డిపాజిట్ గల్లంతు అనేది అభ్యర్థులను కొన్నిరోజుల పాటు నిరాశ చెందేలా చేస్తుందని నాయకులు పేర్కొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక

కరీంనగర్: మహబూబ్‌నగర్‌లో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు జరిగిన హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ట్రినిటీ కళాశాల విద్యార్థి రతన్ ప్రతి భ కనబరిచాడని విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. హరియాణాలోని హిస్సార్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

ముగ్గురిపై కేసు

జమ్మికుంట (హుజూరాబాద్): ఓ వ్యక్తి భూమిలోకి అక్రమంగా ప్రవేశించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని మడిపల్లిలో చింతల మోహన్‌రెడ్డికి చెందిన భూమిలోకి అతని అన్న కుమారులు చింతల మహేందర్‌రెడ్డి, కోమల్‌రెడ్డి, తిరుపతిరెడ్డిలు మంగళవారం అక్రమంగా ప్రవేశించి, ఒడ్లపై గడ్డి మందు పిచికారీ చేశారు. అడిగినందుకు మోహన్‌రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించి, చంపుతామని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

బొగ్గుబాయి

సింగరేణిని వాడుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం

- బీఎంఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



మాట్లాడుతున్న సతయ్య

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థను ఒక ఏటీఎం కార్డులా వాడుకుంటోందని బీఎంఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. మంగళవారం యైటింక్లయిన్ కాలనీ ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వాడుకున్న విద్యుత్, బొగ్గు బావుల బకాయిలు రూ.25 వేల కోట్లు ఉండగా వడ్డీతో కలిపి రూ.32 కోట్లను సింగరేణికి చెల్లించాల్సింది ఉందన్నారు. దీనివల్ల కార్మికులకు నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. ఎంఎండీఆర్ చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఒక్క కొత్త బొగ్గు బావిని కూడా తీసుకురాలేదని మండిపడ్డారు. సింగరేణిలో 34 బొగ్గు గనులు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 24కు తగ్గిందన్నారు. గతంలో 62 వేల మంది కార్మికులు ఉండగా ప్రస్తుతం 34 వేలకు తగ్గినట్లు, కాంట్రాక్టు కార్మికులు 7 వేల మంది ఉండగా 30 వేలకు చేరినట్లు తెలిపారు. ఈ నెల 15న దేశంలోని రెండు బొగ్గు బ్లాక్‌ల వేలం పాటలో యాజమాన్యం పాల్గొని, సింగరేణి బొగ్గు గనులను సంస్థకే కేటాయించాలని కోరాలని డిమాండ్ చేశారు. నాయకులు కుమారస్వామి, సత్యనారాయణ, రవీందర్, నీలం రవి, లింగయ్య నాయక్ తదితరులున్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న అశోక్

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థలో వివిధ సెక్షన్లలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీలో కాంట్రాక్టు కార్మికులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను వివరించారు. కాంట్రాక్టు కార్మికులకు పర్మినెంట్ కార్మికుల మాదిరిగా హక్కులు, అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే 22 జీవోను గెజిట్ చేసి, కాంట్రాక్ట్ కార్మికులకు అమలు చేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఓట్ల కోసం వచ్చే నాయకులను ఆయా అంశాలపై నిలదీయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మి, శారద, మేరీ, లింగయ్య, ఎం.లక్ష్మి, రాములు, రాజేశ్వరి, అనసూయ, శ్రీను, అంజలి, భాగ్యలక్ష్మి, తేజ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సర్క్యులర్ జారీకి 'కోలిండియా' అంగీకారం

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

గోదావరిఖని: 11వ వేజ్‌బోర్డు ఒప్పందంలోని అంశాల అమలుపై సర్క్యులర్ జారీ చేసేందుకు కోలిండియా యాజమాన్యం అంగీకరించిందని ఏఐటీయూసీ అధ్యక్షుడు, వేజ్‌బోర్డు మెంబర్ వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన జేబీసీసీఐ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల వివరాలను వెల్లడించారు. ఎల్‌టీసీ, ఎల్‌ఎల్‌టీసీ, పెటర్నిటీ లీవ్స్‌తో సహా అన్నీ అమలు చేసేలా ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారన్నారు. కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాల అమలు కోసం కమిటీ ఏర్పాటుకు అంగీకరించారని పేర్కొన్నారు. అలాగే, సీపీఆర్‌ఎంఎస్ అమలుకు కమిటీ ఏర్పాటు చేశారని, డిపెండెంట్ ఉద్యోగాల కోసం కమిటీ వేశారన్నారు. కోలిండియా, సింగరేణిలో మిగులు క్వార్టర్లపై నిర్ణయం తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జాతీయ కార్మిక సంఘాలకు చెందిన జేబీసీసీఐ సభ్యులతోపాటు కోలిండియా చైర్మన్, ఇతర అధికారులు పాల్గొన్నారని తెలిపారు.

ఓసీపీలో కాంట్రాక్టు కార్మికుడికి తీవ్ర గాయాలు

- పరిస్థితి విషమం

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–5 ఓసీపీలో మంగళవారం ప్రమాదం జరిగింది. పీసీ పటేల్ ప్రైవేట్ ఓబీకి చెందిన వాహనం ఢీకొట్టడంతో ప్రైవేట్ బొలెరో నడుపుతున్న అంశాల శ్రావణ్ అనే ఎంపీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. క్వారీలోని ఫోర్‌సీమ్ ఏరియాలో ఆ వాహనానికి సాంకేతిక సమస్య తలెత్తడంతో డ్రైవర్ ఆపి, పరిశీలిస్తున్నాడు. అదే సమయంలో ప్రైవేట్ ఓబీకి చెందిన తుఫాన్ వాహనాన్ని డ్రైవర్ రివర్స్‌లో తీసుకువచ్చి, ఢీకొట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో శ్రావణ్ ప్రక్కటెముకలు విరిగి, తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని హుటాహుటిన సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అంతర్గతంగా రక్తస్రావం కావడంతో శ్రావణ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ఈ సంఘటనపై అధికారులు విచారణ చేపట్టారు.

'ఎర్రకుంట'లో ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులు

- ఫిర్యాదు చేసిన గ్రామస్తులు
- నిలిపివేయించిన అధికారులు



కట్టను తవ్వి, చేపట్టిన పునాది నిర్మాణం

ధర్మారం: మండలంలోని ఎర్రగుంటపల్లి శివారు ఎర్రకుంట శిఖం భూమిలో అక్రమంగా ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు ఆదేశాలతో యజమాని పనులు నిలిపివేశాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. ఎర్రకుంట శిఖం భూమి సమీపంలో పట్టా భూములున్నాయి. కొన్నేళ్ల క్రితం ఇక్కడ పట్టా భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి ఇప్పటికే ఒక ఫంక్షన్‌హాల్ నిర్మించాడు. ఇటీవల ఎర్రకుంట సమీపంలో మరో ఫంక్షన్‌హాల్ పనులు ప్రారంభించాడు. పునాది కోసం కుంట కట్టను కొంతభాగం తవ్వించాడు. అంతేకాకుండా, గతంలో మత్తడి ఉన్న స్థలాన్ని సైతం పూర్తిగా కబ్జా చేసి, పనులు చేయిస్తున్నాడు. దీనిపై గ్రామస్తుల ఫిర్యాదుతో ఇరిగేషన్ అధికారులు వర్క్ ఇన్‌స్పెక్టర్ సదన్‌ను మంగళవారం ఎర్రకుంట వద్దకు పంపించారు. కట్ట కొంతభాగాన్ని, మత్తడి స్థలాన్ని కబ్జా చేసినట్లు ఆయన అనుమానించారు. విషయాన్ని ఆయన రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సదరు యజమానికి ఫోన్ చేసి, పనులు ఆపాలని ఆదేశించడంతో నిలిపివేశారు. కాగా, ఎర్రకుంటకు హద్దులు నిర్ణయించాలని, కట్ట వరకు దారి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు.

తపాలా శాఖలో కొత్త పథకం

- వార్షిక ప్రీమియం రూ.399, రూ.396లతో రూ.10 లక్షల బీమా
- 18 నుంచి 65 ఏళ్ల వారికి వర్తింపు



జ్యోతినగర్: కరోనా తర్వాత ప్రజల్లో హెల్త్ ఇన్సూరెన్స్‌పై అవగాహన బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖలో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రమాద బీమాను గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీ పేరుతో ప్రారంభించింది. ఏడాదికి రూ.399, రూ.396 చెల్లిస్తే రూ.10 లక్షల బీమా వర్తిస్తుంది. పోస్టల్ పేమెంట్ బ్యాంక్ ద్వారా దీన్ని చెల్లించాల్సి ఉంటుంది. తక్కువ ప్రీమియంతో అనేక ప్రయోజనాలు కల్పించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో పెద్దపల్లి, హుజూరాబాద్‌లలో హెడ్ పోస్టాఫీసులు, 37 సబ్ పోస్టాఫీసులు, శాఖలు 353 ఉన్నాయి.

ప్రయోజనాలు ఇవీ..

ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ తన కస్టమర్లకు గ్రూప్ యాక్సిడెంట్ బీమా పాలసీ అందిస్తోంది. 18 నుంచి 65 ఏళ్ల వయసు కలిగినవారు దీన్ని తీసుకోవచ్చు. ప్రమాదంలో మరణించినా.. శాశ్వత వైకల్యం ఏర్పడినా, అవయవం కోల్పోయినా, పక్షవాతం వచ్చినా రూ.10 లక్షలు చెల్లిస్తారు. పాలసీ తీసుకున్న వ్యక్తి ప్రమాదం జరిగి, వైద్యం కోసం ఆస్పత్రిలో చేరితే ఐపీడీ కింద రూ.60 వేలు, ఔట్ పేషెంట్‌కు రూ.30 వేలు ఇస్తారు. విద్య ప్రయోజనానికి గరిష్టంగా ఇద్దరు పిల్లలకు రుసుములో 10 శాతం లేదా రూ.లక్ష వరకు ఎంచుకోవచ్చు. కుటుంబ ప్రయోజనాలకు రూ.25 వేలు, అంత్యక్రియలకు రూ.5 వేలు ఇస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



పోస్టాఫీసు పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. బాలికల కోసం సుకన్య సమృద్ధి యోజన తదితర పథకాలు అందుబాటులో ఉన్నాయి. సేవింగ్ ఖాతాలను కూడా అందిస్తున్నాం. ఏటీఎం కార్డు సౌకర్యం ఉంది. ప్రమాద బీమా పాలసీతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. గతేడాది పాలసీ తీసుకున్న వారు ఈ నెలలో రెన్యువల్ చేయించుకోవాలి.
– ఎం.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ పోస్ట్స్, గోదావరిఖని సబ్ డివిజన్